కోలాహలంగా మహోత్సవాలు


విద్యుత్ వెలుగుల్లో ఆలయ ముఖద్వారం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న చిన్నారులు



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. భక్తులతో కొండంతా నిండిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కిలకిటలాడుతూ కన్పించాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పలు అంశాలకు నృత్యాలు ప్రదర్శించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు


శ్రీచక్ర పూజ నిర్వహిస్తున్న అర్చకులు


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

భక్తులకు అందుబాటులో తాగునీరు ఉంచాలి

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం వాటర్‌పాయింట్లు అందుబాటులో ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం భవానీఘాట్, పున్నమిఘాట్, కృష్ణవేణి ఘాట్, రథం సెంటర్, కేటీ రోడ్, మిల్క్ ప్రాజెక్ట్, సీవీఆర్ ఫ్లైఓవర్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు అందుబాటులో ఉండాలని అన్నారు. నగరంలో 39 వాటర్ పాయింట్లు ఉన్నాయని, భక్తుల అవసరం నిమిత్తం ఇంకో 2 పాయింట్లు పెంచామని చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి కమిషనర్‌కు వివరించారు. వాటి సంఖ్య మరింత పెంచాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆయన ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌ని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థి టి.గణేష్ కృష్ణా యూనివర్సిటీ తరుపున ప్రీ రిపబ్లిక్ డే పరడ్‌కు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయిన గణేష్ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీ తరపున తమ కళాశాలకు చెందిన విద్యార్థి గణేష్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ కు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణంగా పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ డి.యుగంధర్, డాక్టర్ కె.రమేష్, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ బాలసుబ్రమణ్యం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మధురంగా సాగిన నామ సంకీర్తనలు

విజయవాడ కల్చరల్: దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సందనంలో బుధవారం నిర్వహించిన నామ సంకీర్తనా కార్యక్రమం మధురంగా సాగింది. సంగీత కళాకారిణి తుషార పూర్ణవల్లి బృంద సభ్యులు, రామదాసు, పురందర దాసు, అన్నమయ్య,త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను ఆలపించారు. క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ యువ కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం: కంచికామకోటిపీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆకాశవాణి టాప్ గ్రేడ్ విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ వాగ్గేయకారుల కీర్తనలతోపాటు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. యువ సంగీత కళాకారుడు విద్యాసాగర్ నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది.

కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



విజయవాడకల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద గాయకుడు బాల సుబ్రహ్మణ్యంకు స్వరాంజలి, సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధి బోడి ఆంజనేయ రాజుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ప్రసూనా రామన్ సత్కార గ్రహీత కృషిని అభినందించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు బాలు సినీ రంగ సేవలను వివరించారు. పరుచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. బ్రహ్మానందరావు, బోడి ఆంజనేయరాజులను సత్కరించారు. మల్లాది స్వాతి, అయ్యప్పన్, నాగమణి పలు చిత్రగీతాలను ఆలపించారు.

నేడు వరప్రసాద్ అష్టావధానం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువుల భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో గురువారం శివరామకృష్ణ క్షేత్రంలో సహస్రావధాని డాక్టర్ కె. వరప్రసాద్ అష్టావధానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం తెలిపారు. మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి సంచాలకులుగా అష్టావధాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు లోక్ కల్యాణ మేళా


పటమట(విజయవాడతూర్పు): ప్రధాన మంత్రి స్వానిధి 2.0 పథకం ద్వారా వీధి విక్రయదారుల సంక్షేమార్థం లోక్ కల్యాణ మేళ నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీధి విక్రయదారులకు పీఎం స్వానిధి పథకం క్రింద ఋణాలకు దరఖాస్తులను స్వీకరించడం.. అనంతరం రుణాలు మంజూరు చేస్తామన్నారు.

అన్నపూర్ణాదేవీ.. నమోస్తుతే..

మధురానగర్(విజయవాడసెంట్రల్):శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు చేశారు. గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కె.రామారావు బృందం నాదస్వరం, మంగళవాయిద్యాలతో పూజలు చేశారు. అభివృద్ధి కమిటీ కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ పర్యవేక్షించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.


శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో


బావాజీ పేటలో అమ్మవారు

బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచారపరిషత్ బచ్చుమాధవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణే సదాపూర్ణే....

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా నగరంలోని లోకమాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శారదాంబను వృషభవాహన మహేశ్వరిగానూ, బాలా త్రిపురసుందరిని అన్నపూర్ణాదేవిగానూ శ్రీమహాలక్ష్మిని ధాన్యలక్ష్మిగానూ అలంకరించి పూజలు నిర్వహించారు. దుర్గా శప్తశతి పారాయణం, చండీహోమం నిర్వహించారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శారదామాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బ్రహోత్సవాలలో భాగంగా ధ్వజస్తంభ పూజ, ధ్వజారోహణం, భేరీపూజ, సర్వదేవతా ఆరాధన, నవకుంభ ఆహ్వాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ పర్యవేక్షకులు డాక్టర్ ఆర్.రామ్మోనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా....

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్లోని నిదానంపాటి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజాశక్తి నగర్లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి విశేష పూజలు నిర్వహించారు. పైపులరోడ్డు శాంతినగర్, ప్రకాష్‌నగర్లో శ్రీకనకదుర్గమ్మ ఆలయం, సుందరయ్య నగర్లోని వాసవీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. విలేజి కండ్రికలో శ్రీకృష్ణుని గుడి వద్ద, యాదవుల బజార్లో, రాములవారి గుడి వద్ద అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శించుకున్నారు.


ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీగంగానమ్మ


జీవీఆర్‌నగర్‌లో


మధురానగర్ మెయిన్‌రోడ్డులో...


రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో


దావు బుచ్చయ్యకాలనీలో..


వృషభవాహన మహేశ్వరి అలంకారం


నిదానంపాటి అమ్మవారి ఆలయంలో



గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

తక్షణమే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విదేశాలలో చదువుకుంటున్న విద్యార్థుల ఇబ్బందులను గుర్తించాలని పలువురు తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడారు. గతంలో నారా లోకేష్‌ను కలిసినప్పుడు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్కాలర్ షిప్‌లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగతో జతకట్టి పోలీసు చోరీలు

- ఏపీఎస్పీ కానిస్టేబుల్ బాగోతం
- బెయిల్‌పై వచ్చి విజయవాడ దొంగతో దోస్తీ

కర్నూలు:ఆయనో కానిస్టేబుల్. బాగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఓ దొంగతో దోస్తీ కట్టాడు. తన ద్విచక్ర వాహనంపై దొంగను కూర్చోబెట్టుకొని నగరంలో తిరుగుతుంటాడు. తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు అక్కడ దొంగను రంగంలోకి దించుతాడు. బయట తాను గస్తీ పోలీసుననే ఫోజు ఇస్తాడు. పని పూర్తి కాగానే ఇద్దరూ కలసి లక్ష్మీ టౌన్‌షిప్‌లోని కానిస్టేబుల్ ఇంటికి చేరుకుంటారు. చోరీ సొత్తును విక్రయించగా వచ్చిన డబ్బును పంచుకుంటారు. మోస్ట్ వాంటెడ్ గజదొంగ జగదీష్‌ను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ ఎద్దుల కృపానందం బాగోతం వెలుగులోకి వచ్చింది.

కారు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు

కల్లూరులోని తెలుగు వీధిలో నివాసముంటున్న కార్ డ్రైవ్ గురుస్వామి ఈ ఏడాది ఫిబ్రవరి 19న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలసి వృత్తి రీత్యా బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన 11 తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. ఈ మేరకు బాధితుడు గురుస్వామి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విక్రమసింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి క్రైం పార్టీ సిబ్బందితో కలసి దర్యాప్తులో భాగంగా నగర శివారులో విజయవాడకు చెందిన దొంగ జగదీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కానిస్టేబుల్ దోస్తీ వ్యవహారం వెలుగు చూసింది. జగదీష్‌పై 25కు పైగా చోరీ కేసులు ఉన్నాయి.


కానిస్టేబుల్ కృపానందంతో పాటు జగదీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

ఫోన్ కాల్ డేటా ఆధారంగా వెలుగులోకి..

దర్యాప్తులో భాగంగా ఇటీవల కాలంలో జైలు నుంచి రిలీజైన నిందితుల వివరాలను పోలీసులు సేకరించారు. కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ కృపానందం సెల్‌ఫోన్‌కు గజదొంగ జగదీష్ నుంచి తరచూ ఫోన్లు వచ్చినట్లు కాల్ డేటా సేకరించారు. కల్లూరులోని గురుస్వామి ఇంట్లో దొంగతనం జరిగిన రోజు విజయవాడకు చెందిన జగదీష్ కదలికలు ఉన్నట్లు సాంకేతిక ఆధారాలతో గుర్తించి విచారించడంతో వారి మధ్య ఉన్న బంధం బయటపడింది. విధి నిర్వహణలో భాగంగా కృపానందం విజయవాడకు వెళ్లినప్పుడు అక్కడ గార్డు డ్యూటీ విధుల్లో ఉండగా జగదీష్ పరిచయమయ్యాడు. అది కాస్తా స్నేహంగా మారి తరచూ కర్నూలుకు వస్తూ కానిస్టేబుల్ ఇంట్లోనే ఉంటూ ఇద్దరూ కలసి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెలుగుచూసింది. ఇలా కర్నూలు నగరంలో ఇద్దరూ కలసి పలు ఇళ్లల్లో చోరీలు చేసినట్లు విచారణలో అంగీకరించారు. నిందితుల నుంచి 5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. 2007లో కృపానందం ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఇతను తన సర్వీసులో పలుమార్లు వివాదాల్లో చిక్కుకుని సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిసింది. నేరానికి ఉపయోగించిన కృపానందం పల్సర్ మోటార్‌బైక్‌ను సీజ్ చేసి ఇరువురినీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు.

మారుతీ విక్టోరిస్ ఆవిష్కరణ

పటమట(విజయవాడతూర్పు): మారుతీ డీలర్ వరుణ్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మారుతీ విక్టోరిస్ కారును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని హోటల్ నోవోటెల్ వరుణ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 కారణంగా కార్ల ధరలు తగ్గాయని, నూతన మారుతీ విక్టోరిస్ కార్లు, జీఎస్టీ కారణంగా తగ్గిన కార్ల ధరలపై కొత్త ఆఫర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. మారుతీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో హిసాషి టకుచి మాట్లాడుతూ.. మారుతీ సుజుకీ కూడా కొన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ. 1.29 లక్షల వరకు తగ్గించిందని ఇది వినియోగదారులకు ధరలను అందుబాటులో వచ్చాయన్నారు. ఈ సరికొత్త విక్టోరిస్ కార్‌లో లెవల్ 2 అడాస్(అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెన్సీ సిస్టమ్), డాల్బీ అట్మాస్‌తో కూడిన 6 స్పీకర్ ఇన్ఫినిటీ ఆడియో సిస్టమ్, గెస్చర్ కంట్రోల్, పవర్ టెయిల్‌గేట్, పెట్రోల్ స్టార్ట్ హైబ్రీడ్, సీఎన్జీ వంటి బహుళ ఇంధన ఆప్షన్లు, స్మార్ట్ ప్లే ఇన్ఫోటైన్‌మెంట్, అలెక్సా కనెక్టివిటీ, ఓటీఏ అప్‌డేట్స్ వంటివి ఫీచర్లు ఉన్నాయన్నారు. ఆరు ఎయిర్ బ్యాగ్లు, 5 స్టార్ల బీఎస్ సీఏపీ సేఫ్టీ రేటింగ్ ఉందని చెప్పారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ నూతన విక్టోరిస్ కారు మొత్తం 21 వేరియంట్లలో, 10 ఆకర్షణీయమైన రంగుల్లో లభ్యమవుతుందన్నారు. వరుణ్‌గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్సీ రాజు, సీఈవో గిరి, సిబ్బంది పాల్గొన్నారు.


విక్టోరిస్ కారును ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తానన్న సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. అక్టోబరు 13, 14, 15 తేదీల్లో అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, అందులో గత మూడేళ్లలో చేసిన కార్యక్రమాల అనుభవాలను చర్చించుకుని రానున్న కాలంలో చేపట్టనున్న కర్తవ్యాలను రూపొందించనున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ విధానాల వల్లమహిళలు సంతృప్తికరంగా లేరన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఆఫీస్ బేరర్స్ శ్రీదేవి, అలివేలు, సత్యవతి, రమణి పాల్గొన్నారు.



ఘనంగా షిరిడీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో 107వ పుణ్యతిథి మహోత్సవాలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. లోక కళ్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీసహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యతిథి మహోత్సవాల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.


హోమం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ టూరిజం, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కథక్ కళాకారిణి జి.నీలవేణి కథక్ సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. వీణా విద్యాంసురాలు శ్రీ సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు వీణపై పలు సంప్రదాయ కీర్తనలు పలికించారు. అమలాపురానికి చెందిన సి.రాము బృందం ఉరుములు అంశాన్ని ప్రదర్శించారు. డప్పులపై వారు నిర్వహించిన అంశాలు ఆకట్టుకున్నాయి. సంగీత కళాశాల నృత్య విభాగం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య బృందం భరతనాట్య సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. చివరిగా నాట అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటకం నుంచి కాటిసీను, వారణాసి సీన్‌లను ప్రదర్శించారు. హరిశ్చంద్రుడిగా పలగాని ఫణి శంకర్ గౌడ్, చంద్రమతిగా డాక్టర్ బి.రత్నశ్రీ, నక్షత్రకునిగా చీమకుర్తి ఆంజనేయులు, వీరబాహునిగా దంపూరి దుర్గాప్రసాద్ నటించారు. మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ పాల్గొన్నారు.

- విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న కళాకారులు పడుతున్న ఇబ్బందుల గురించి బుధవారం సంచికలో సాక్షి కథనాన్ని ప్రచురించింది. వార్తకు స్పందించిన నిర్వాహకులు కళాకారులకు అల్పాహారం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. దీంతో హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెయిర్ పికర్స్ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మెప్మా ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట నారాయణ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో బుధవారం హెయిర్ పికర్స్ మహిళలకు జీవనోపాధి సహాయ కార్యక్రమం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి అధ్యక్షతన న్విహించిన కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నమస్తే రాష్ట్ర కోఆర్డినేటర్ అనిల్ కుమార్ మాట్లాడారు. డీబీఆర్సీ డెప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ. 8వేలు విలువైన జీవనోపాధి సహాయం 30 మంది హెయిర్ పికర్స్ మహిళలకు అందించామని పేర్కొన్నారు. రూ. 2.5 లక్షలు వెచ్చించి సామగ్రి సమకూర్చామన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రత్నకుమారి, డీబీఆర్సీ కోఆర్డినేటర్లు రమేష్, అనిత, ప్రవల్లిక పాల్గొన్నారు.